కొడకంచి జాతర చూద్దాం.. రారండి

జాతరకు సర్వం సిద్ధం

• బంగారు, వెండి బల్లుల దర్శనం ప్రత్యేకం


శ్రీదేవి భూదేవి సమేత ఆదినారాయణ స్వామి దేవాలయం

జిన్నారం (పటాన్‌చెరు): తెలంగాణ దక్షిణ కంచిగా ప్రసిద్ధి చెందిన శ్రీదేవి భూదేవి సమేత ఆదినారాయణస్వామి జాతర ఉత్సవాలకు సర్వం సిద్ధమైంది. జిన్నారం మండలం కొడకంచి గ్రామంలోని ఆదినారాయణ స్వామి ఆలయానికి వెయ్యి ఏళ్ల చరిత్ర ఉంది. ఇక్కడ ఆదినారాయణ స్వామి ఎత్తైన బండపై స్వయంభుగా వెలసిన ఆధారాలు ఉన్నాయి. ఇక్క స్వామివారు విశిష్ట పూజలు అందుకుంటున్నాడు. కంచికి పోకున్న కొడకంచికి వెళ్లి దర్శించుకోవాలనే నానుడు ఇక్కడ ప్రసిద్ధి. ఆలయంలో బంగారు, వెండి బల్లులను తాకితే దోష నివారణ జరుగుతుందని భక్తుల విశ్వాసం. గ్రామానికి తూర్పు ముఖాన ఆలయ ముఖద్వారం ఉంటుంది. ఆలయానికి తూర్పున కోనేరు ఉత్తరం వైపు చెరువు పంటపొలాలు భక్తులకు ఆధ్యాత్మిక చింతన కలిగిస్తాయి. స్థానికుల వివరాల ప్రకారం చెరువు తవ్వుతున్నప్పుడు 101 శివలింగాల్లో ఒక లింగం ఇక్కడ దొరికిందని.. ఆ శివలింగాన్ని ఆలయం పక్కనే ఉన్న హనుమాన్ ఆలయంలో ప్రతిష్ఠించి పూజిస్తున్నారు.

జాతరలో ముఖ్యఘట్టం రథోత్సవం..

జాతరలో ముఖ్య ఘట్టంగా రథోత్సవాన్ని పెద్ద సంఖ్యలో భక్తులు చూసి తరిస్తారు. కొడకంచి గ్రామ వీధుల్లో ఆదినారాయణ స్వామి రథోత్సవంలో ఊరేగింపు శోభాయాత్ర కనుల పండువగా ప్రతిఏటా నిర్వహిస్తారు.

జాతరకు అన్ని ఏర్పాట్లు పూర్తి



ఫిబ్రవరి1 నుంచి 10 వరకు నిర్వహించనున్న శ్రీ ఆదినారాయణ స్వామి జాతర ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ ఫౌండర్ రామోజీరావు తెలిపారు. అత్యంత మహిమను సంతరించుకున్న భక్తకోటి భావనకు అనుగుణంగా బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. రథోత్సవంలో మంత్రి దామోదర, ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొననున్నట్లు తెలిపారు.

– అల్లాని రామోజీరావు, ఆలయ ఫౌండర్

యూనిఫైడ్ పెన్షన్ స్కీంపై ఆందోళన


నోటిఫికేషన్ ప్రతులను కాల్చుతున్న ఉద్యోగులు

కంగ్టి(నారాయణఖేడ్): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన యూనిఫైడ్ పెన్షన్ విధానం(యూపీఎస్)పై ప్రభుత్వ ఉద్యోగులు మండలంలోని తడ్కల్ పాఠశాలలో నిరసన వ్యక్తం చేశారు. రాష్ట్ర కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లాలోని పలు పాఠశాలలు, కళాశాలలు, వివిధ శాఖల కార్యాలయాల్లో యూపీఎస్ ప్రతులను కాల్చి వ్యతిరేకతను తెలియజేశారు. ఈ విధానంతో ఉద్యోగుల కుటుంబాలకు సామాజిక భద్రత ఉందని జిల్లా అధ్యక్షుడు రాంచందర్ విమర్శించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, కార్యదర్శి అంజయ్య, జిల్లా కోశాధికారి మల్లేశం, సంఘ సభ్యుడు విజయభాస్కర్, ఫరూక్, నాగార్జునరెడ్డి, అశోక్ రెవెన్యూ సిబ్బంది, ఆయా శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.

‘బేటీ బచావో.. బేటీ పడావో’పై అవగాహన


అవగాహన కల్పిస్తున్న అధికారులు, ఉపాధ్యాయులు

నారాయణఖేడ్: జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో బేటీ బచావో.. బేటీ పడావో దశాబ్ది ఉత్సవాలు నిర్వహించారు. ఇందులో భాగంగా ‘లింగ వివక్షత’ అనే అంశంపై నారాయణఖేడ్‌లోని మహాత్మా జ్యోతిబాపూలే బీసీ బాలుర గురుకులంలో అవగాహన కల్పించారు. విద్యార్థులచే ప్రతిజ్ఞ, ర్యాలీ, మొక్కలు నాటించారు. మహిళా సాధికారత కేంద్రం ఫైనాన్షియల్ స్పెషలిస్టు నర్సింహులు మాట్లాడుతూ.. బాలల హక్కులు, చట్టాలు, ఫోక్సో చట్టం, నిర్భయ చట్టం, నేరాలు, మద్యపానం, ధూమపానం వల్ల జరిగే అనర్థాలను వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్, అధ్యాపకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రయాణికుల క్షేమమే లక్ష్యం

డీఎస్పీ వెంకట్‌రెడ్డి


డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ

నారాయణఖేడ్: ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చడమే డ్రైవర్లు లక్ష్యంగా పెట్టుకోవాలని డీఎస్పీ వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవంలో భాగంగా డీఎస్పీ మాట్లాడుతూ.. ఆర్టీసీ సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. ప్రయాణికుల ప్రాణాలు తమచేతుల్లో ఉన్నాయని డ్రైవర్లు గుర్తించి ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తూ బస్సులు నడపాలని తెలిపారు. ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయొద్దని సూచించారు. కార్యక్రమంలో సీఐ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్సై శ్రీశైలం, డీఎం మల్లేశయ్య, మార్కెటింగ్ సెల్ ఇన్‌చార్జి పాండు తదితరులు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ఇద్దరికి జైలు

పటాన్‌చెరు టౌన్/సంగారెడ్డి క్రైమ్: డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు జిల్లా కోర్టు జరిమానా, జైలు శిక్ష విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ కథనం ప్రకారం .. సోమవారం నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో 11 మందిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. వారిని మంగళవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపరచగా నలుగురికి రూ. 2 వేలు, ఐదుగురికి రూ.1500 జరిమానా విధించారు. అలాగే, ఒకరికి మూడు రోజులు జైలు, మరోవ్యక్తికి రెండు రోజులు జైలు శిక్షతో పాటు జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

పాఠశాల తనిఖీ


యోగాభ్యాసాన్ని పరిశీలిస్తున్న బస్వరాజ్

జహీరాబాద్: మండలంలోని ఖాశీపూర్ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలను ఎంఈఓ బస్వరాజ్ మంగళవారం సందర్శించారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు తీరు, మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థుల యోగాభ్యాసాన్ని పరిశీలించారు.

నల్లబ్యాడ్జీలతో నిరసన


ఆస్పత్రి ఎదుట ధర్నా చేస్తున్న వైద్యులు, ఇబ్బంది

రామచంద్రాపురం (పటాన్‌చెరు): ఈఎస్‌ఐను సొసైటీ చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించినందుకు నిరసనగా మంగళవారం పట్టణంలోని ఈఎస్ఐ ఆస్పత్రి ఎదుట వైద్యులు, సిబ్బంది నల్లబ్యాడ్జీలు ధరించి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యుల సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు రమేష్ మాట్లాడుతూ.. పాలకులు ఈఎస్ఐను ప్రైవేటీకరణ చేయడానికి కుట్రలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. లక్షలాది మంది కార్మికులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్న ఈఎస్ఐను ప్రైవేటీకరణ చేయడం ఏమిటని ప్రశ్నించారు. ఈ నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైద్యులు కిరణ్, బ్రీజ మోహన్, ఆదిత్య, నాయకులు నాగరాజ్, ప్రశాంత్ పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత


జేసీబీతో నిర్మాణాలను తొలగిస్తున్న ఆర్ఐ

జిన్నారం (పటాన్‌చెరు): గడ్డపోతారం మున్సిపాలిటీ కాజిపల్లి పరిధిలోని సర్వే నంబర్ 181లో అక్రమ నిర్మాణాలపై రెవెన్యూ అధికారులు కొరడా ఝులిపించారు. తహసీల్దార్ భిక్షపతి ఆదేశాల మేరకు ఆర్ఐ జయప్రకాష్ నారాయణ జేసీబీ సాయంతో అక్రమ నిర్మాణాలను నేలమట్టం చేశారు. ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మార్డీ పీఏసీఎస్ చైర్మన్ తొలగింపు

కల్హేర్(నారాయణఖేడ్): మండలంలోని మార్డీ పీఏసీఎస్ చైర్మన్ వెంకటేశంను తొలగిస్తూ జిల్లా సహకార అధికారి కిరణ్‌కుమార్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. పీఏసీఎస్‌లో నిధుల దుర్వినియోగం చేశారనే ఫిర్యాదు మేరకు ఇటీవల జిల్లా అధికారులు విచారణ జరిపారు. పీఏసీఎస్ సీఈఓ అరవింద్‌గౌడ్‌ను ఇదివరకు సస్పెండ్ చేశారు. చైర్మన్ వెంకటేశంపై వచ్చిన ఆరోపణలపై విచారణ నివేదిక అందజేశారు. వెంకటేశంను డైరెక్టర్, చైర్మన్ పదవి నుంచి తొలగించారు. వైస్‌చైర్మన్ సంగారెడ్డిను చైర్మన్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

ఆ గ్రామాలను అమీన్‌పూర్‌లో కలపండి

మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ప్రిన్సిపాల్ సెక్రటరీని కోరిన ఎమ్మెల్యే


ప్రిన్సిపాల్ సెక్రటరీకి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: అమీన్‌పూర్ మండలంలో మిగిలిన జానకంపేట, వడక్‌పల్లి గ్రామాలను అమీన్‌పూర్ మున్సిపాలిటీలో కలపాలని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ప్రిన్సిపాల్ సెక్రటరీ దాన కిషోర్‌ను ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి కోరారు. మంగళవారం హైదరాబాద్‌లోని ఎంఏయూడీ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అమీన్‌పూర్ మండలంలోని ఎనిమిది గ్రామ పంచాయతీల్లో ఆరు గ్రామ పంచాయతీలను ఇటీవల అమీన్‌పూర్ మున్సిపాలిటీలో విలీనం చేశారు. రెండు గ్రామాలు విలీనం కాకపోవడంతో పరిపాలనాపరంగా తీవ్రనష్టం జరుగుతుందని తెలిపారు. మిగిలిన రెండు గ్రామాల విషయంపై వెంటనే నిర్ణయం తీసుకోవాలని విన్నవించారు. కార్యక్రమంలో అమీన్‌పూర్ మాజీ జెడ్పీటీసీ సుధాకర్ రెడ్డి, సీనియర్ నాయకులు వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

సబ్సిడీపై డ్రిప్ పరికరాలు


మాట్లాడుతున్న ట్రైనీ కలెక్టర్ మనోజ్, సోమేశ్వర్‌రావు

ఝరాసంఘం(జహీరాబాద్): ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో రైతులకు సబ్సిడీపై డ్రిప్ పరికరాలను అందజేస్తున్నట్లు ఉద్యానవన శాఖ జిల్లా అధికారి సోమేశ్వర్ రావు పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని బిడెకన్నె, మాచునూర్, కృష్ణాపూర్, బర్దిపూర్ గ్రామాల్లో రైతులకు సబ్సిడీ ద్వారా అందించిన డ్రిప్ పరికరాలను తనిఖీ చేశారు. సబ్సిడీపై అందించిన డ్రిప్ పరికరాలు ఎంతమేరకు ఉపయోగపడుతున్నాయని రైతులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ మనోజ్‌కుమార్, హెచ్ఓ సునీతరోజు మహీంద్రా ఈపీసీ డీసీఓ జైపాల్‌రెడ్డి, రైతులు శివకుమార్, ఇస్మాయిల్ పాల్గొన్నారు.

ఖేడ్‌లో అగ్నిప్రమాదం

రూ.5 లక్షల మేర ఆస్తినష్టం


దగ్ధమైన దుకాణాన్ని పరిశీలిస్తున్న రాజుపటేల్

నారాయణఖేడ్: ఖేడ్ పట్టణంలోని చంద్రయ్యకు సంబంధించిన పాత ఇనుప సామగ్రి దుకాణంలో మంగళవారం తెల్లవారు జామున అగ్ని ప్రమాదం సంభవించింది. స్థానికులు యాజమానికి, అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది మంటలు ఆర్పేలోగా సామగ్రి మొత్తం కాలిపోయింది. బాధితుడి ఫిర్యాదుతో స్థానిక డిప్యూటీ తహసీల్దార్ రాజుపటేల్ సందర్శించి పంచనామా నిర్వహించారు.

మున్సిపల్ అధికారులకు సన్మానం


అధికారులను సన్మానిస్తున్న మాజీ కౌన్సిలర్

జిన్నారం (పటాన్‌చెరు): బొల్లారం మున్సిపాలిటీలో 6వ వార్డు మాజీ కౌన్సిలర్ గుండ్ల సుజాత మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో మున్సిపల్ అధికారులు, సిబ్బందికి సన్మానం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ప్రజాసమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేసిన సిబ్బందికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కమిషనర్ మంగతాయారు సిబ్బంది, కార్మికులను ఘనంగా సత్కరించారు.

క్షయవ్యాధి వైద్య శిబిరం ఏర్పాటు


పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదల మున్సిపాలిటీ అన్నారం పరిధిలోని ఇటుక బట్టి కేంద్రాల వద్ద క్షయవ్యాధి నివారణ శిబిరాన్ని మంగళవారం ఏర్పాటు చేశారు. శిబిరంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ మధుకర్ వైద్య సిబ్బందితో కలిసి రోగులకు ఎక్స్రే పరీక్షలు నిర్వహించారు. 105 మందికి పరీక్షలు నిర్వహించగా వారిలో 16 మందికి క్షయవ్యాధి లక్షణాలను గుర్తించారు. వారికి తెమడ పరీక్షలు నిర్వహించి చికిత్స ప్రారంభిస్తామని వైద్యులు తెలిపారు. కార్యక్రమంలో టీవీ అలర్ట్ ఇండియా జీఎం దేవేందర్, టీబీ జిల్లా కోఆర్డినేటర్లు కృష్ణ, చందు, వసంత, స్థానిక నాయకులు ప్రతాప్‌రెడ్డి, మురళి, కార్యదర్శి సంగీత, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

నూతన కమిషనర్లుగా బాధ్యతల స్వీకరణ


రఘు


మంగతాయారు

జిన్నారం (పటాన్‌చెరు): ఉమ్మడి జిన్నారం గుమ్మడిదల మండలంలో నూతనంగా ఏర్పాటైన మున్సిపాలిటీకు గుమ్మడిదలకు రఘు, గడ్డపోతారానిక మంగతాయారు మంగళవారం ఇన్‌చార్జి కమిషనర్లుగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. స్థానికుల సహకారంతో మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేయనున్నట్లు తెలిపారు.

‘పది’ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ


విద్యార్థులను ప్రశ్నలు అడుగుతున్న ఎంఈఓ

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): ఉపాధ్యాయులు పదవ తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించి, ఉత్తమ ఫలితాలను సాధించాలని ఎంఈఓ శంకర్ అన్నారు. మంగళవారం మండలంలోని ఆరూర్, మెలగిరిపేట్ ప్రభుత్వ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వంట గదులు, మూత్రశాలలను పరిశీలించారు. ఉపాధ్యాయులతో సమావేశమై పలు సూచనలు చేశారు. విద్యార్థులకు పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు కృష్ణవేణి, భాగ్య, సైదానాయక్, సీఆర్పీ రాజేశ్వర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బండి సంజయ్ రాజీనామా చేయాలి


కేంద్ర మంత్రి బండి సంజయ్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

సంగారెడ్డి ఎడ్యుకేషన్: ప్రజాయుద్ధనౌక గద్దర్‌పై కేంద్ర మంత్రి బండి సంజయ్ చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా సంగారెడ్డి పట్టణంలో మంగళవారం ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం, బహుజన సంఘాల ఆధ్వర్యంలో బండి సంజయ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ యువజన సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు బైండ్ల అశోక్ కుమార్ మాట్లాడుతూ.. దొరల ఆకృత్యాలపై పోరు చేసి, భూస్వాములపై తిరుగుబావుట ఎగరవేసిన గద్దర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన బండి సంజయ్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఇకనైనా బీజేపీ నాయకులు మనువాద భావజాలాన్ని పక్కనపెట్టి ప్రజాస్వామ్యం, రాజ్యాంగ విలువలకు కట్టుబడి పని చేయాలని మండిపడ్డారు. కార్యక్రమంలో జిల్లా ఆర్గనైజ్ సెక్రటరీ పోతురాజు పవన్, బీసీ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బీరయ్య యాదవ్, బహుజన నాయకులు పాల్గొన్నారు.

కూలీలందరికీ ‘ఆత్మీయ భరోసా’ ఇవ్వండి

జహీరాబాద్ టౌన్: భూమిలేని కూలీలందరికీ ఆత్మీయ భరోసా పథకం కింద రూ.12 వేలు ఇవ్వాలని సీపీఐ డివిజన్ కార్యదర్శి నర్సింలు డిమాండ్ చేశారు. ఆయన మాట్లాడుతూ.. జాబ్ కార్డు కలిగిన వారికే ఈ పథకం అమలు చేస్తామని చెప్పడం వల్ల పేదలకు అన్యాయం జరుగుతుందని ఆరోపించారు. సొంత ఊళ్లో పనులు దొరక్క ఉపాధి కోసం వలస వెళ్లిన వారు తిరిగి స్వగ్రామానికి వచ్చిన వారికి జాబ్ కార్డులు లేవన్నారు. అలాంటి వారికి కూడా ఆత్మీయ భరోసా అమలు చేయాలన్నారు.

నిబంధనలు పాటిద్దాం.. ప్రమాదాలను నివారిద్దాం


మాట్లాడుతున్న ట్రాఫిక్ సీఐ సుమన్‌కుమార్

సంగారెడ్డి క్రైమ్: ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ట్రాఫిక్ సీఐ సుమన్‌కుమార్ అన్నారు. జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం పట్టణంలోని కరుణా హైస్కూల్లో ట్రాఫిక్ నియమాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ట్రాఫిక్ సీఐ సుమన్‌కుమార్ మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాల కారణంగా దేశంలో రోజుకు 400 మంది మరణిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విధినిర్వహణలో మద్యం సేవించి స్కూల్ బస్సులు నడపరాదన్నారు. విద్యార్థులు బస్సు ఎక్కి,దిగే సమయాల్లో డ్రైవర్, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ద్విచక్ర వాహనం నడిపే వారితో పాటు వెనుక కూర్చున్న వారు కూడా హెల్మెట్ ధరించాలని తెలిపారు. 18 ఏళ్ల నిండిన వారు తప్పకుండా డ్రైవింగ్ లైసెన్స్ తీసుకోవాలని సూచించారు. రోడ్డు ప్రమాద నివారణకు భద్రతా నియమాలు పాటిస్తామని విద్యార్థులచే పోలీస్ సిబ్బంది, ఉపాధ్యాయులు ప్రతిజ్ఞ చేయించారు.

ఇస్నాపూర్ మున్సిపల్ కమిషనర్‌గా జ్యోతిరెడ్డి


కమిషనర్ జ్యోతి రెడ్డి

పటాన్‌చెరు టౌన్: నూతనంగా ఏర్పడిన ఇస్నాపూర్ మున్సిపాలిటీకి కొత్త కమిషనర్‌గా జ్యోతిరెడ్డికి ఇన్‌చార్జిగా బాధ్యతలు కేటాయించారు. గ్రామ పంచాయతీల రికార్డులను మున్సిపల్ కమిషనర్ స్వాధీనం చేసుకోవాలని సీడీఎంఏ నుంచి ఆదేశాలు రావడంతో బాధ్యతలు తీసుకున్నారు. పంచాయతీలకు సంబంధించిన రికార్డుల సేకరణ ఫిబ్రవరి 6 వరకు జరగనున్నట్లు సమాచారం. అనంతరం ఆన్‌లైన్ సేవలు ప్రజలకు అందుబాటులోకి రానున్నాయి.

సంక్షిప్త వార్తలు

◆ పిచ్చికుక్కల దాడి ..

కంగ్టి(నారాయణఖేడ్): కంగ్టి మండంలోని ఆయా గ్రామాల్లో మంగళవారం ఒకేరోజే పిచ్చికుక్కల దాడికి 14 మందికి గాయాలైయ్యాయి. వీరు కంగ్టి పీహెచ్‌సీలో చికిత్స పొందినట్లు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నాగమణి తెలిపారు. కంగ్టిలో 8 మందికి, జమ్గి, దామర్‌గిద్దా, వాసర్‌ల్లో ఇద్దరికి చొప్పున కుక్కలు కరిచినట్లు పేర్కొన్నారు. వీధుల్లో చిన్నారులు, వృద్ధులు ఒంటరిగా తిరగకుండా ఉండాలని వైద్యాధికారి సూచించారు. గాయాలైన వారు యాంటీ రబీస్ వ్యాక్సినేషన్ కోర్సు పూర్తిగా తీసుకోవాలని తెలిపారు. మండలంలోని అన్నీ గ్రామ పంచాయతీల్లో కుక్కల నివారణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

◆ ఖాతాలో నుంచి నగదు మాయం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): మొబైల్ ఫోన్‌కు వచ్చిన లింక్‌ను ఓపెన్ చేయడంతో వ్యక్తి ఖాతాలో నుంచి రూ.39వేలు మాయమయ్యాయి. కొల్లూరు పోలీసుల కథనం ప్రకారం.. తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని విద్యుత్‌నగర్ కాలనీలో నివాసం ఉండే ముఖేష్ ఫోన్‌కు మంగళవారం ఫ్లిప్‌కార్డు నుంచి ఓటీపీలు వచ్చాయి. వెంటనే అతని కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి ఫ్లిప్‌కార్డులో ఏమైనా బుక్ చేశారని అడిగారు. వారు తము ఏమి బుక్ చేయలేదని సమాధానం చెప్పడంతో ఆ లింక్‌ను ఓపెన్ చేసి డిలిట్ చేశాడు. అంతలోనే రూ.14వేలు, రూ. 25 వేలు రెండు సార్లు అతని ఖాతాలో నుంచి డబ్బులు పోయినట్లు గుర్తించాడు. వెంటనే కొల్లూరు పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

◆ మంత్రి దామోదరకు కృతజ్ఞతలు

మునిపల్లి(అందోల్): మక్తక్యాసారం గ్రామంలో టూరిజం హబ్ ఏర్పాటు చేస్తున్నందుకు మంత్రి దామోదర రాజనర్సింహ్మకు మక్తక్యాసారం గ్రామ మాజీ సర్పంచ్‌లు మల్లేశం, చంద్రయ్య, కాంగ్రెస్ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. మంగళవారం మడలంలోని బుదేరాలో వారు మాట్లాడారు. మక్తక్యాసారం గ్రామంలో ఐల్యాండ్, రెస్టారెంట్, రెండు 50 మంది కెపాసిటీ ఉన్న బోట్లను ఏర్పాటు చేసి ప్రాజెక్టు మీదుగా సింగూర్ వరకు ఏర్పాటు చేయడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. టూరిజం హబ్‌గా తీర్చిదిద్దడంతో సుమారు 17 గ్రామాలకు రోడ్డు సౌకర్యం, నిరుద్యోగులకు ఉద్యోగాలు లభించే అవకాశం ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పటోళ్ల శేఖర్, వీరన్న, పండరి, నగేశ్, అజీజ్, విఠల్ పాల్గొన్నారు.

◆ గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయాలి

మునిపల్లి(అందోల్): పొల్కంపల్లి గ్రామంలో లైబ్రరీ (గ్రంథాలయం) ఏర్పాటు చేయాలని గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ నాగమణి జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్మన్ నాగారం గొల్ల అంజయ్యను కోరారు. మంగళవారం మండలంలోని పొల్కంపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్మన్ అంజయ్యను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. జిల్లా చైర్మన్ అంజయ్య సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

◆ అభివృద్ధి పనుల్లో వేగం పెంచండి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం పట్టణంలోని శ్రీనివాస్‌నగర్‌కాలనీ బాల విహార్ పార్కులో జరుగుతున్న పనులను వేగవంతం చేయాలని కార్పొరేటర్ బి.పుష్ప ఆదేశించారు. మంగళవారం జీహెచ్ఎంసీ ఉపకమిషనర్ సురేష్‌తో కలసి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజల కోరిక మేరకు పార్కును పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు.